# హృదయఘోష

-సిహెచ్. లలితా విజయ్‌కుమార్

అది పచ్చటి పంట పొలాలతో, చూడముచ్చటయిన ప్రకృతి సోయగాలతో, కళాతపస్వి విశ్వనాథ్ గారి సినిమాల్లో కనిపించేలాంటి ఓ పల్లెటూరు. పల్లెటూరు అయినా భాగ్యనగరానికి దగ్గర్లో వుండడంతో పట్నం వాసనలు, పోకడలు కూడా నేర్చింది ఆ పల్లె.

ఆ కుగ్రామంలో, ఆ రోజు, సీతారామయ్య గారి ఇంటి ముందు అవినీతి ఆస్తులతో ఖరీదు చేసిన ఖరీద యిన కార్లెన్నో బారులుతీరి వున్నాయి. మరి సీతా రామయ్య గారు ఏ క్యాబినెట్ మంత్రో, అధికార పార్టీ ఎమ్మెల్యేనో అనుకుంటే పొరపాటే. అతడో సాదాసీదా వ్యక్తి. కాకపోతే 'భారతీయుడు'లో 'సేనాపతి'లా తన ధైర్య సాహసాలతో, పోరాట పటిమతో, తెల్లదొరల నెదిరించిన మహానుభావుడు.

నరనరాన భారతీయత రంగరించుకొన్న స్వాతంత్ర్య పోరాట యోధానయోధుడు- సీతా రామయ్యగారి ధర్మపత్ని భారతమ్మ, భర్త అడుగుజాడల్లో నడిచే సగటు భారతీయ మహిళ. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత కూడా పౌరులకు దేశభక్తి నూరిపోస్తూ ఆ దంపతులు దేశ సేవలో పునీతులయ్యేవారు.

పంచ పాండవుల్లా వీరికి ఐదుగురు సంతానం. మంచి చదువులు చెప్పించి, ప్రయోజకుల్ని చేసి, దేశా నికి పనికొచ్చే విధంగా తీర్చిదిద్దాలన్న సీతారామయ్య గారి ఆశలన్నీ అడియాసలై చదువులు ఒంటబట్టక, పల్లె వదిలి పట్నంబాట పట్టారు కొడుకులంతా. తీరని మనోవ్యథతో మంచం పట్టాడు సీతారామయ్య.

చదువు సంధ్యలు లేకపోయినా పెద్దకొడుకు రాజకీయంగా నిలదొక్కుకుని, ఢిల్లీ స్థాయిలో స్కాములు నడిపే స్థాయికి చేరుకున్నాడు. అతనిది పార్లమెంటు స్థాయి.

ఇక రెండోవానిది అసెంబ్లీ స్థాయి. సిటీ రియల్ ఎస్టేట్ రంగంలో కాలుపెట్టి, అమాయక మధ్యతరగతి జనాల తలలపై చేతులు పెట్టి, కోట్లకు పడగలెత్తాడు. రాష్ట్రాన్నే శాసించే స్థాయికి ఎదిగాడు.

ఇక ముచ్చటగా మూడోవాడు జిల్లా స్థాయి నాయ కుడు. జిల్లాపరిషత్ స్టేషనరీ కుంభకోణంలో లక్షలు సంపాదించి, జిల్లా యంత్రాంగాన్ని తన గుప్పిట్లో వుంచుకుని, జిల్లా రాజకీయ చదరంగంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాడు.

ఇక నాలుగోవాడిది మండల స్థాయి. మండల పరిషత్‌కు సంబంధించిన నిధులు స్వాహా చేయడంలో దిట్ట. మండల స్థాయిలో ఎవరికేది కావాలన్నా అతనిదే ఏకఛత్రాధిపత్యం.

ఇక చివరివాడిది గ్రామస్థాయి రాజకీయం. ఆ ఊరి వరకు అతని మాటకు ఎదురేలేదు. గ్రామ స్థాయిలో ఎటువంటి అవినీతికయినా కేరాఫ్ అడ్రస్

## మగడు బాణీలు

కృత్రిమ వర్షాలకు
మేఘమథనం!
పాలనాభివృద్ధిపై
మేధోమథనం!!
చదువుల తల్లికే
దేవాలయాలు
విధాతకు లేవు
పూజా పునస్కారాలు!!
పెళ్లిళ్ళు స్వర్గంలో
నిర్ణయింపబడితే!
భూలోకంలో
పెళ్లిచూపులెందుకో?!
నకిలీ 'డాక్టరు'
వైద్యం చేస్తే!
రోగులకు
నరకానికి 'పాస్‌పోర్టులే'!!
నాయకులకు పదవే
అక్షయపాత్ర!
అది లేకుంటే
ప్రేక్షక పాత్రే!!
కిరీటం ఏదైనా
శిరస్సుపైనే!
పాదరక్షలెంత
ఖరీదైనా కాళ్ళకే!!

-కళాప్రియ

అతనే.

బ్రతికుండగానే కొడుకుల అవినీతి ఇంటి దరిదావు లకు కూడా రానివ్వద్దని, వ్యథతోనే కన్నుమూశాడు సీతారామయ్య. ఇక ఆయన లేడన్న ధైర్యంతోనే కొడు కులు ఆ ఇంట్లో కాలుపెట్టగలిగారు. తండ్రి బ్రతికు న్నన్ని నాళ్లు లేని ధైర్యం, ప్రేమ ఇప్పుడు వచ్చాయి. దానికి కారణం తండ్రి పోయిన బాధ కంటే, గ్రేటర్ పుణ్యాన పెరిగిన భూముల ధరల మీది మమకారవే ఎక్కువ. సీతారామయ్య గారు జీవితాంతం కష్టపడి వెనకేసిన కొద్దిపాటి భూమికీ ఇపుడు కోట్ల విలువ పలుకుతోంది. అదీ లేకుంటే ఆయన్ని కడసారి చూడటానికి కూడా తీరిక దొరికేది కాదు వాళ్లకి. తండ్రి మరణవార్త తెలిసో, భూముల ధరలు పెరిగాయన్న వార్త తెలిసో అందరూ కట్టకట్టుకొని వాలిపోయారు. అదీ అక్కడ కార్ల సందడి.

కర్మకాండల తంతు అయిందనిపించి, భూములన్నీ పంచుకుని, పాత ఇంటిని మాత్రం తల్లికి వదిలి ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లిపోయారు. కంటికి మింటికి ధారగా ఏడ్చింది తల్లి భారతమ్మ. ఆమెదిపుడు ఒంటరి బతుకు. ఐదుగురు కొడుకులుండీ అనాథ. తనకిపుడు తోడూ నీడా అన్నీ ఆ ఇల్లే. కాలక్రమేణా భారతమ్మలాగానే ఇల్లు కూడా ముసలిదయి, పెచ్చులూడుతోంది. ఆ ఊరు మాత్రం రియల్ సొగసులతో కొత్తరూపు సంత రించుకుంది. ఔటర్ రోడ్లు, గ్రేటర్ సోయగాలతో తళుకులీనుతోంది.

సీతారామయ్యగారి ఆత్మ నిత్యం ఘోషిస్తూనే వుంది. కానీ, పెరిగిన ట్రాఫిక్ రద్దీలో కలిసిపోయి ఎవరికీ వినిపించకుండా పోయింది.

'గోటిచుట్టుపై రోకటి పోటు'లా భారతమ్మకు ఆలంబనగా వున్న ఇల్లు కూడా రింగు రోడ్డుకు సమర్ప యామి అయింది. భారతమ్మ రోడ్డున పడింది. గ్రామ స్థులే దయతలచి చోటిచ్చారు. కొడుకులకు ఫోన ద్వారా విషయం తెలియజేశారు.

పార్లమెంటు స్థాయిలో వున్న పెద్ద కొడుకు, ఔటర్ రింగు రోడ్డు విషయాన్ని పార్లమెంటులో ప్రస్తావించే టట్లు చేస్తానని హామీ మాత్రం ఇచ్చాడు. కాని అతనికీ తెలిసు దానికి గౌరవ సభ్యులకు ముడుపులిస్తేనే అది పార్లమెంటులో చర్చకు వస్తుందని. అందుకే ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోలేదు.

ఇక రెండో కొడుకు, అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బిజీగా వున్నందున వీలు చూసుకొని అసెంబ్లీ తీర్మా నంలో రింగు రోడ్లపై చర్చకు వచ్చేలా చూస్తానన్నాడు.

మూడో కొడుకు, జిల్లాపరిషత్ స్టాండింగ్ కౌన్సి ల్‌లో స్టేషనరీ కొనుగోలుమాల్‌పై విచారణ జరుగుతుం డడంతో బిజీగా వున్నానంటూ ఫోన్ ఆపుచేశాడు.

నాలుగో కొడుకు, అధికారులకు ముడుపులు ఇచ్చి అయినా సరే, రింగ్ రోడ్డు అలైన్‌మెంటు మార్చి తల్లికి మేలు చేస్తానన్నాడు.

ఐదో కొడుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ తమ పార్టీవే కాబట్టి, నిర్భాగ్యుల కోటాలో తన తల్లికి భార తమ్మ ఇల్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు.

ఈ హామీల్లో ఏ ఒక్కటీ నెరవేరే నమ్మకం లేని భారతమ్మ ఓ అర్ధరాత్రి ఈ లోకాన్ని విడిచి శాశ్వత నిద్రలోకి వెళ్లిపోయింది. భారతీయుల స్వాతంత్ర్య పోరాటాలకు తాళలేక దేశాన్ని అర్ధరాత్రి విడిచి వెళ్లిన బ్రిటిష్ పాలకుల్లా, స్వతంత్రం వచ్చి అర్ధ శతాబ్దం దాటినా అవినీతి పాలకుల చీకటి పాలనకు తాళలేని స్వతంత్ర భారతిలా.

నడిరోడ్డుపై, అర్ధరాత్రి... భారతమ్మ, పట్టించుకునే నాథుడే లేక, ఎవరో జాలిపడి ఇచ్చిన జీర్ణ వస్త్రమే భారతమ్మ పార్థివ శరీరానికి కప్పారు. దానిమీద అక్క డక్కడా కనిపించే చిరుగులు, మనకు మిగిలే ప్రపంచ బ్యాంకు అప్పుల్లా వున్నాయి.

నిస్తేజంగా, నిర్జీవంగా, నిశ్చలంగా, నిర్వేదంగా తల్లి భారతమ్మ... అవినీతి, బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, స్కాముల పాలన... ఇలా తెల్లదొరలను మించిన నల్లదొరల అరాచక పాలనలో బక్కచిక్కిన సాదాసీదా సగటు భారతీయుని బ్రతుకు చిత్రానికి చిహ్నంగా, నిర్జీవ సాక్ష్యంగా మిగిలింది.

మూసిన కళ్లు ఇంకా జరగబోయే అన్యాయాలు, అక్రమాలు చూడలేమన్నట్టుగా నిశ్చలంగా వున్నాయి.

బోసిపోయిన నోరు 'దేశంలో అర్థాకలితో అలమ టించే అభాగ్యుల అన్నార్తి ఎప్పుడు తీరుతుందో' అన్న ట్లుగా తెరుచుకునే వుంది.

కదలలేని స్థితిలో వున్న కాళ్లూ, చేతులూ, దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, న్యాయవ్యవస్థలన్నింటికీ దర్పణాలుగా కనిపిస్తున్నాయి. పాపం! భారతమ్మ!!

పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంటు స్థాయి వరకు ఏ స్థాయిలో అయినా, ఏ కొంచెమయినా, సగటు భారతీయునికి మేలు జరిగితే మన భారతమ్మకు ఆత్మశాంతి చేకూరుతుంది. అదే భారతమ్మ అభిలాష. వందకోట్ల భారతీయుల హృదయ ఘోష. ■